జాతుల పోరాటాలు

# హురియత్‌తో భారత్ చర్చలు : పూర్వపరాలు

- కె. బాలగోపాల్

కాశ్మీర్ విషయంలో భారతప్రభుత్వ వ్యవహారశైలిని చూసినప్పుడు తోలుబొమ్మలాట చూసిన అనుభూతి కలుగుతుంది. మామూలుగా ఒక మనిషి మరుక్షణం ఏం చేయబోతున్నది ఈ క్షణం తన ముఖంలో, హావభావాలలో గోచరిస్తుంది. తోలుబొమ్మతో అది సాధ్యం కాదు. అది నడిపించే వాడిని బట్టి నడుచుకుంటుంది.

భారతప్రభుత్వం 'కాశ్మీర్ పాలసీ'ని అమెరికా నడిపిస్తున్న దనేది తెలిసిందే. అందుకే కాశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం ఎప్పుడు ఏం చేస్తుందో ఊహించడం సాధ్యం కాదు. ఈ రోజు ప్రకటనను బట్టి రేపటి నిర్ణయాన్ని ఊహించలేము. హోంమంత్రి మాటలను బట్టి ప్రధాన మంత్రి ఏమనబోతాడో ఊహించలేము.

హురియత్ కాన్ఫరెన్స్‌తో భారత ప్రభుత్వం చర్చలకు సిద్ధమనీ, చర్చలలో భారత్ తరఫున హోంమంత్రి స్వయంగా పాల్గొంటాడనీ కొంత కాలం క్రింద కేంద్రప్రభుత్వం చేసిన ప్రకటన అందుకే ఆశ్చర్యం కలిగించ వలసి ఉండి కూడ కలిగించలేదు. అయినా, మనమొక వేళ మర్యాదకోసం ఆశ్చర్య పోయినా దాని నుండి తేరుకునే లోపల అందుకు విరుద్ధమైన ప్రకటన ఢిల్లీ నుండి వెలువడ గలదు కాబట్టి అది అనవసరమైన ప్రయాస కాగలదుకూడ. (ఆశ్చర్యం అనే స్థితిలోకి పోవడం, దానినుండి తేరుకోవడం ప్రయాసే కదామరి!)

అయితే అబద్ధపు విధాన ప్రకటనల వల్ల ఫలితమేమీ ఉండదనుకునే సౌలభ్యం చరిత్ర మనకివ్వలేదు కాబట్టి ఈ నిర్ణయాన్ని విశ్లేషించుకోవడం అవసరం.

**ఆల్‌పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ అనేది 33 కాశ్మీరీ సంస్థల ఉమ్మడి వేదిక. వాటికి ఉన్న సామాన్య గుణం ఒక్కటే. అవన్నీ కూడ జమ్ముకాశ్మీర్ భారత దేశంలో శాశ్వతంగా విలీనం కాలేదనీ విలీనమయి పోయిందన్న భారత్ వైఖరి వివాదాస్పదమయిందనీ నమ్ముతాయి.** ఆ పైన అందరి దృక్పథమూ ఒకటి కాదు. కొన్ని సంస్థలు (జమాతె ఇస్లామీ వంటివి) స్వాతంత్ర్య పోరాటకాలంలో ముస్లిం లీగ్ ప్రతిపాదించిన రెండు జాతుల సిద్ధాంతాన్ని అనుసరించి ముస్లింలు మెజారిటీగా ఉన్న కాశ్మీర్‌లోయ, జమ్ములోని మెజారిటీ జిల్లాలు పాకిస్తాన్‌కు చెందాలని నమ్ముతాయి. కొన్ని సంస్థలు ఆ చరిత్రతో నిమిత్తం లేకుండా, ముస్లింలు ఎక్కడ మెజారిటీగా ఉన్నా అక్కడ ఇస్లామిక్ రాజ్యం ఉండాలి కాబట్టి ఆ ప్రాంతాలన్నీ ఇండియా నుండి వేరుపడిపోయి ఇస్లామిక్ రాజ్యమైన పాకిస్తాన్‌లో చేరాలని నమ్ముతాయి. కొన్ని కాశ్మీరీ జాతీయవాద సంస్థలు జమ్ము-కాశ్మీర్‌ను భారత్‌లోకి తీసుకొచ్చిన విలీనం ఒడంబడికలో అక్కడి ప్రజలకు స్వయం నిర్ణయాధికారం ఇయ్యబడింది కాబట్టి (ఇచ్చినా ఇయ్యకున్నా అది వారి ప్రజాస్వామ్య హక్కు కాబట్టి), తమ భవితవ్యాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛ ఆ ప్రజలకు ఇవ్వాలని కోరుతాయి. ప్రజలు ఏ నిర్ణయం తీసుకున్నా తమకు సమ్మతమేనని ఈ సంస్థలు అంటాయి గానీ, వీరిలో ఎక్కువభాగం ఇటు భారత్‌లో గానీ అటు పాకిస్తాన్‌లోగానీ కలవకుండా జమ్ము-కాశ్మీర్ స్వతంత్రంగా ఉండాలని కాంక్షించేవారే. ఈ సంస్థలలో ప్రముఖమయిన జమ్ము-కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జె.కె.ఎల్.ఎఫ్) తన అభిప్రాయాన్ని స్పష్టంగానే చెప్పుకుంటుంది. **జమ్ము-కాశ్మీర్ ఒక స్వతంత్రమైన లౌకిక, ఫెడరల్, ప్రజాతంత్ర రాజ్యాంగా ఉండాలనేది వారి లక్ష్యం. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే, జెకెఎల్ఎఫ్ అనుయాయులేకాక కాశ్మీరీ జాతీయవాదులందరూ లౌకిక ప్రజాతంత్ర భావాలకు అనుకూలురే.**

భారత్‌లో విలీనాన్ని వివాదాస్పదమైన విషయంగా భావించే అన్ని సంస్థలకు హురియత్ కాన్ఫరెన్స్ ఉమ్మడి వేదిక అన్నది సత్యమే అయినప్పటికీ ఆ భావనలోని భిన్న కోణాలను హురియత్ కాన్ఫరెన్స్ తగుపాళ్లలో ప్రతిబింబించదు. కాశ్మీర్‌లోని సామాన్య ప్రజలలో పాకిస్తాన్ అనుకూల మతవాదం కన్న లౌకిక కాశ్మీరీ జాతీయవాదం ప్రభావమే ఎక్కువ అయినప్పటికీ హురియత్ కాన్ఫరెన్స్‌లో మొదటి కోవకు చెందిన సంస్థలే ఎక్కువ. హురియత్ కాన్ఫరెన్స్ నాయకత్వంలో యాసిన్ మాలిక్, (ఈ మధ్యనే మతవాదులు చంపేసిన) అబ్దుల్‌గనీలోన్ తప్ప తక్కిన వారందరూ ఏదో ఒక మేరకు మత వాదులే.

ఈ వైరుధ్యానికి కారణం లేకపోలేదు. పాకిస్తాన్ సహాయం లేనిదే భారత్ మీద పోరాటం చేయడం కాశ్మీరీలకు సాధ్యం కాదు కాబట్టి, ఆ సహాయం పొందడం సాధ్యం కాని కాశ్మీరీ జాతీయవాదులు అధికభాగం ఆర్గనైజ్ కాకుండా మౌనంగా ఉండిపోయారు. పాకిస్తాన్ సహాయం దొరకగల మతవాద సంస్థలు మాత్రమే చురుకుగా పనిచేస్తుంటాయి. రెండవ కారణం దీనితో ముడిపడి ఉంది. హురియత్ కాన్ఫరెన్స్‌లో సాయుధ పోరాట సంస్థలేవీ లేవు. అన్నీ శాంతియుత మార్గాల ద్వారా అందోళనని చేసే సంస్థలే. అయితే ఏ సంస్థకయితే వెనకాల తుపాకీ ఉంటుందో ఆ సంస్థకే హురియత్ కాన్ఫరెన్స్‌లో నోరు ఉంటుంది. జమాతె ఇస్లామికి వెనక హిజ్బుల్ ముజాహిదీన్ ఉంది కాబట్టి హురియత్‌లో జమాతె ఇస్లామి మాటకు విలువ ఎక్కువ. జె.కె.ఎల్.ఎఫ్‌కు ఇప్పుడు లేకున్నా ఒకప్పుడు సాయుధ పోరాట విభాగం ఉండేది కాబట్టి ఆ సంస్థకు హురియత్‌లో గుర్తింపు ఉంది. ఏ దళమూ లేకపోతే గుర్తింపు ఉండదని గ్రహించిన అబ్దుల్‌గనీ లోన్ కొంత కాలం అల్‌బర్క్ అనే ఒక చిన్న సాయుధ గ్రూపును నడిపాడు. కుప్వారా జిల్లాలో రెండు తాలూకాలకు పరిమితమైన ఈ బృందం త్వరలోనే ఒక రౌడీ మూకగా మారి చెల్లాచెదరయిపోయింది. కానీ లోన్ ప్రయోజనం నెరవేరింది. అతను చనిపోయేదాకా హురియత్ కాన్ఫరెన్స్‌లో ఒక ప్రముఖ నాయకుడిగానే ఉన్నాడు.

అయితే వీరిద్దరినీ మినహాయించి వేరే ఏ కాశ్మీరీ జాతీయ వాద సంస్థా తన వీపు వెనక తుపాకులను సమకూర్చుకోలేక పోయింది కాబట్టి వేరే సంస్థలేవీ హురియత్ కాన్ఫరెన్స్‌లో బలం సంపాదించుకోలేక పోయాయి. చాలావరకు అసలు అందులో చేరే ప్రయత్నమే చేయలేదు. పాకిస్తాన్ నుండి సహాయం పొందే మతవాద సంస్థలు మాత్రం తుపాకులు తెచ్చుకున్నాయి, వనరులు తెచ్చుకున్నాయి, సమాజంలో పెద్ద గొంతు కాకున్నా హురియత్ కాన్ఫరెన్స్‌లో ఆధిక్యత సంపాదించుకున్నాయి.

ఇంకొక విషయంకూడ చెప్పుకుంటే కాశ్మీరీ సమాజం గురించి మన అవగాహన పెరుగుతుంది. లష్కర్-ఇ-తయ్యబా, జైష్-ఇ-మహమ్మద్‌ల పేర్లు మనం తరచుగా వింటుంటాం. ఇవి

పాక్-ఇస్లామిక్ సంస్థలు. ఇస్లాంను బలప్రయోగంద్వారా ప్రపంచమంతటా వ్యాపింపజేసే కర్తవ్యంగా 'జిహాద్'ను అర్థం చేసుకుని ఆచరిస్తున్న సంస్థలు. అందులో భాగంగా ఇవి కాశ్మీర్ పోరాటంలో వచ్చి చేరాయి. ఈ సంస్థల పోరాట శీలాన్ని హురియత్ కాన్ఫరెన్స్ అభినందిస్తుంది గానీ వీరి ప్రతినిధి ఒక్కరూ హురియత్‌లో లేరు. మతం ప్రాతిపదికన కాశ్మీర్ పాకిస్తాన్‌లో కలవాలని నమ్మేవారు కాశ్మీర్‌లో ఉన్నారుగానీ ఈ పాక్-ఇస్లామిక్ జిహాదీ సంస్థల దృక్పథం కలిగిన మేధావులుగానీ, రాజకీయ సంస్థలుగానీ లేవు.

కాశ్మీరీ సమాజానికీ, వారి స్వయం నిర్ణయాధికారం కోసం జరుగుతున్న పోరాటానికీ, దాని రాజకీయ ప్రతినిధి అయిన హురియత్ కాన్ఫరెన్స్‌కు మధ్య ఇన్ని వైరుధ్యాలున్నప్పటికీ సగటు కాశ్మీరీ జాతీయవాదులు ఆ పోరాటాన్ని మొత్తంగా తమదిగా ఆహ్వానిస్తారు. హురియత్ కాన్ఫరెన్స్‌ను దాని రాజకీయ ప్రతినిధిగా గుర్తిస్తారు. 'మా మధ్య తేడాలు మా స్వంత విషయం. దాని ఊసు మీకెందుకు? మీరు పోరాట కారులతోనూ హురియత్ కాన్ఫరెన్స్‌తోనూ చర్చలు జరపండి' అని అంటారు.

అయితే భారత ప్రభుత్వం హురియత్ కాన్ఫరెన్స్‌ను ఏ అర్థంలోనూ కాశ్మీరీ ప్రజల రాజకీయ ప్రతినిధిగా గుర్తించడానికి సిద్ధపడి లేదు. "జమ్ము-కాశ్మీర్‌లో ఎన్నికయిన ప్రజాప్రభుత్వం ఉంది. ఏదైనా మాట్లాడేది ఉంటే వారితో మాట్లాడుతాం. వేరే ఎవరితోనయినా ఎందుకు మాట్లాడుతాం?" అనేది భారత్ వైఖరి. వేరొక సందర్భంలో ఇది సహేతుకమైన వైఖరే అయివుండేదేమోగానీ కాశ్మీర్ విషయంలో కాదు. ఎన్నికలలో పాల్గొనే పార్టీలు జమ్ముకాశ్మీర్ భారత్‌లో శాశ్వతంగా విలీనమయి పోయిందని నమ్మే పార్టీలు. వేర్పాటు కాంక్ష గురించి వారితో మాట్లాడేది ఏం ఉంటుంది? దాని గురించి వేర్పాటు కాంక్షకు ప్రాతినిధ్యం వహించే సంస్థలతో మాట్లాడాలి. అంటే ఆ సంస్థల ఐక్య వేదిక అయిన హురియత్ కాన్ఫరెన్స్‌తో మాట్లాడాలి. ఇది హురియత్ జవాబు. కానీ వేర్పాటును కాంక్షించే వారే తప్ప విలీనాన్ని అంగీకరించేవాళ్లు కాశ్మీరీలుకారా అనేటట్టయితే అందరి రాజకీయ ప్రతినిధులతోనూ (తగు రూపంలో) చర్చలు జరపవలసి ఉంటుందే తప్ప అననుకూల వర్గాన్ని చూడనే చూడమని అంటే ఎట్లా?

అయితే మొన్నటివరకు హురియత్ కాన్ఫరెన్స్ కూడ భారత్‌తో ద్వైపాక్షిక చర్చలకు సుముఖంగా లేదు. ఇండియా, పాకిస్తాన్, కాశ్మీర్ ప్రతినిధులు త్రైపాక్షికంగా కూర్చొని మాట్లాడుకోవాలని వారి డిమాండు. దీనికి వారు రెండు కారణాలు చెప్పేవారు. పాకిస్తాన్ కూడ 'కాశ్మీర్ వివాదం'లో భాగమే కాబట్టి వారుకూడ చర్చలలో బాగం కావాలన్నది ఒక కారణం. పాత జమ్ము-కాశ్మీర్ భూభాగం ఇండియాలోనే కాక పాకిస్తాన్‌లోనూ ఉంది కాబట్టి కాశ్మీరీలు ఇద్దరితోనూ మాట్లాడక తప్పదనేది రెండవ కారణం. ఇందులో మొదటి కారణాన్ని హురియత్ కాన్ఫరెన్స్‌లోని మతవాద సంస్థలు నొక్కి చెప్పగా, రెండవది కాశ్మీరీ జాతీయవాదులు ప్రధానంగా చెప్పే కారణం.

ఇప్పుడు భారత్ వైఖరీ, హురియత్ కాన్ఫరెన్స్ వైఖరీ కూడ మారినట్టు అనిపిస్తుంది. హురియత్‌తో నేరుగా మాట్లాడడానికి భారత ప్రభుత్వం సిద్ధపడగా, భారత్‌తో ద్వైపాక్షిక చర్చలకు హురియత్ సిద్ధపడింది. ఈ మార్పును అర్థం చేసుకోవాలంటే ఈ మధ్యకాలంలో జరిగిన కొన్ని పరిణామాలను అర్థం చేసుకోవాలి.

ఒకటి, హురియత్ కాన్ఫరెన్స్ ఇప్పుడు చీలింది. కాశ్మీర్‌లో ఇప్పుడు రెండు హురియత్ కాన్ఫరెన్స్‌లు ఉన్నాయి. ఒకదానిని పాకిస్తాన్ అధికారికంగా 'అసలయిన హురియత్ కాన్ఫరెన్స్' గా గుర్తించింది. రెండవ దానితో భారత్ మాట్లాడడానికి సిద్ధపడింది. ఎన్నికలలో దొంగచాటుగా పాల్గొంటున్న సంస్థలను బహిష్కరించాలా, అక్కరలేదా అనేది ఈ చీలికకు కారణమైన వివాదంగా కనిపించినప్పటికీ, దాని వెనక అంతకంటె బలమైన తేడాలున్నాయనేది స్పష్టమే. సాయుధ పోరాటానికిచ్చే ప్రాముఖ్యాన్ని తగ్గించి రాజకీయ చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించుకునే ప్రయత్నాన్ని మొదలు పెట్టాలనీ, కాశ్మీరీల పోరాటాన్ని పాకిస్తాన్ తన స్వప్రయోజనాలకోసం వాడుకుంటున్నదని గుర్తించి కాశ్మీరీల ప్రయోజనాలనే ప్రధానం చేయాలనే ఒక వర్గం భావించగా, ఇది పోరాటాన్ని నీరుగార్చి భారత్‌తో రాజీ పడటానికి నాంది అని వైరివర్గం అభియోగం. వారితో మాట్లాడడానికి భారత్ సిద్ధపడడం, భారత్‌తో ద్వైపాక్షికంగా మాట్లాడడానికి వారు సిద్ధపడడం వీరి అభియోగానికి బలం చేకూర్చినట్టయింది. అబ్దుల్‌గనీలోన్ బతికి ఉన్నట్టయితే మొదటి వర్గానికి అతనే బహుశా ప్రధాన ప్రతినిధి అయివుండేవాడు. అందుకే మిలిటెంట్లు అతనిని కాల్చి చంపారు. అయినప్పటికీ హురియత్‌లో అత్యంత ప్రతిష్ఠగల నాయకులయిన మౌల్వీ ఫరూఖ్, అబ్దుల్‌గనీ భట్ ఆవర్గాన్ని నడిపించారు. ఉద్దేశ్యపూర్వంగానే మైనారిటీ షియాల ప్రతినిధి అయిన మౌల్వీ అబ్బాస్ అన్సారీని దానికి చైర్మన్ చేసారు. చీలికవర్గానికి ముందు నుండి మిలిటెంట్‌ల ప్రధాన ప్రతినిధిగా ఉన్న సయ్యద్ అలీషా గిలానీ నాయకత్వం వహించాడు.

భారత్‌తో చర్చలకు సిద్ధపడిన అన్సారీవర్గం తాము త్రైపాక్షిక చర్చలు జరగాలన్న అభిప్రాయాన్నిగానీ పాకిస్తాన్‌కూడ కాశ్మీర్ వివాదంలో భాగమేనన్న అభిప్రాయాన్ని గానీ విడిచిపెట్ట లేదనీ, దానికొక తొలి మెట్టుగా మాత్రమే భారత్‌తో ద్వైపాక్షిక చర్చలకు ఒప్పుకున్నామనీ అంటున్నది. పోరాట ఆవశ్యకతను తిరస్కరించడం లేదుగానీ రాజకీయ పరిష్కార మార్గాలు అన్వేషించడం అవసరం అని భావిస్తున్నామని అంటున్నది. ఇదంతా లొంగుబాటుకు ఒక సాకేనా అనేది రాబోయే దినాలలో తెలగలదు. కానీ కాశ్మీర్ స[illegible]లో వీరి అభిప్రాయానికి మద్దతు లేకపోలేదని గుర్తించడం అవసరం. మిలిటెంట్లు హతమార్చిన అబ్దుల్‌గనీలోన్ మొదటి వర్ధంతి రోజు ఆంధ్రప్రదేశ్, పంజాబుల నుండి వెళ్లిన ఒక హక్కుల బృందం కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో పర్యటిస్తూ ఉంది. మిలిటెంట్లకు ప్రధాన స్థావరమైన ఆ జిల్లానుండి లోన్ ప్రథమ వర్ధంతి సభకు శ్రీనగర్‌కు వందలాది వాహనాలలో తరలి వెళ్తున్న జనాన్ని చూస్తే లోన్ అభిప్రాయాలకు ప్రజా పునాది లేకపోలేదని స్పష్టంగా అర్థం అయింది. కాశ్మీరీలు ఈ 13 సంవత్సరాలలో దాదాపు 50 వేల ప్రాణాలు పోగొట్టుకున్నారు. అంతకు పదిరెట్లు ప్రజలు చిత్రహింసలు, ఇళ్ల విధ్వంసం, లూటీ అనుభవించారు. తుపాకీ ద్వారా కాకుండ అన్య మార్గాల ద్వారా కాశ్మీరీ జాతీయవాద లక్ష్యాన్ని సాధించుకునే ప్రయత్నం వారికి ఆకర్షణీయంగా కనిపించడం సహజం. వారిని గానీ దానికి స్పందిస్తున్న సంస్థలను గానీ దూరంనుండి తప్పుపట్టడం ఉచితం కాకపోవచ్చు. ఈ ప్రయత్నం నాయకుల అవకాశవాదానికీ భారత్ ఎత్తుగడలకూ అందరి నెత్తినా కూర్చున్న అమెరికా స్వార్థానికీ బలయ్యే ప్రమాదం లేదా అంటే ఉంది. కానీ అనంతంగా రక్తం ఓడతూ ఉండమని కాశ్మీరీలను శాసించడానికి మనమెవరం?

☆ ☆ ☆